క్లుప్తంగా

19న గుడికట్ల సంబరాలు

ముదిగుబ్బ: అనంతపురంలో ఈ నెల 19న జరగనున్న గుడికట్ల సంబరాలకు హాజరై విజయవంతం చేయాలని జిల్లా కురబ సంఘం అధ్యక్షులు సామకోటి ఆదినారాయణ, గౌరవ అధ్యక్షులు కురుబ శివానందలు పిలుపునిచ్చారు. సోమవారం ముది గుబ్బలో కరపత్రాలను వారు విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘం జనరల్ సెక్రటరీ రమేష్, ప్రచార కార్యదర్శి కేసాని ఆదినారాయణ, ఉపాధ్యక్షులు పవన్, ప్రభాకర్, నారాయణస్వామి, కమ్మన్న, మల్లికార్జున, నాగరాజు, శ్రీరాములు, సత్తి రామకృష్ణ, లక్ష్మి నారాయణ, శీన, కిష్ట, యోగేశ్వర్, శివ, రామక్రిష్ణ, తదితరులున్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం


ఆలయ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న దాత ప్రొఫెసర్ రాజేష్

కనగానపల్లి: మండల కేంద్రంలోని పురాతన ఆలయం తిరుమలరాయుడు స్వామి ఆలయ అభివృద్ధి పనుల కోసం ప్రొఫెసర్ రాజేష్ రూ.లక్ష విరాళం అందించారు. స్థానిక గ్రామస్తులతో కలసి ఆదివారం ఆలయాన్ని సందర్శించి, పూజలు చేశారు. అనంతరం తిరుమల రాయుడి గుట్టపై ఉన్న పురాతన ఆలయాభివృద్ధి కోసం చేపట్టిన పనులకు తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు.

చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో దీపావళి పండుగను పురస్కరించుకుని ఆదివారం, సోమవారం రెండురోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెన్నకేశవస్వామి మూలవిరాట్‌ను ప్రత్యేక పూలతో అలంకరించారు

15న హ్యాండ్ బాల్ పోటీలు

బత్తలపల్లి: అనంతపురం పట్టణంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఈ నెల 15న జిల్లా స్థాయి జూనియర్ బాలికల హ్యాండ్ బాల్ జట్టుకు ఎంపిక ఉంటుందని జిల్లా హ్యాండ్ బాల్ అసోషియేషన్ కార్యదర్శి శివశంకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 1, 2004 తరువాత జన్మించిన వారు అర్హులన్నారు. ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీ తీసుకొని రావాల్సి ఉంటుందన్నారు. ఎంపికైన వారు ఈ నెల 18 నుంచి 20వ వరకూ పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 8978137522, 9705885939లో సంప్రదించాలని ఆయన కోరారు.


ఆర్థిక సాయం అందజేత


ఆర్థిక సాయం అందిస్తున్న ఎంపీటీసీ శివారెడ్డి

నల్లమాడ: కుటాలపల్లి తండాకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త శంకర్‌నాయక్(50) అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. నల్లమాడకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు టీడీ క్రిష్ణసుమన్‌రెడ్డి (కిట్టు) మృతుడి అంత్యక్రియల కోసం రూ.15,000 ఆర్థికసాయం సమకూర్చారు. ఆ మొత్తాన్ని స్థానిక ఎంపీటీసీ శివారెడ్డి మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. నంద తదితరులు పాల్గొన్నారు.

రామగిరి: మండలంలోని పాపిరెడ్డిపల్లి,ఎన్ఎస్ గేట్‌కు చెందిన బాధితులకు జెడ్పీటీసీ గోసే నాగార్జున, సర్పంచు నరేంద్ర ఆర్థికసాయం అందించారు. కొన్నిరోజులక్రితం పాపిరెడ్డిపల్లికి చెందిన వెంకటేష్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా, రూ.10 వేలు, ఎన్ఎస్ గేట్‌కు చెందిన కూరగాయల బువ్వమ్మకు రూ.10 వేలు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం అందించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి


భాస్కర్‌నాయక్

గాండ్లపెంట: తుమ్మలబైలు పెద్దతండాకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త, గ్రామ 4వ క్లస్టర్ గృహసారథిగా ఉన్న ఇంద్రావత్ భాస్కర్‌నాయక్(35) మృతి చెందాడు. కొద్దిరోజుల క్రితం అధిక రక్తపోటుతో కింద పడడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శనివారం మృతి చెందాడు. మృతుని కుటుంబాన్ని ఆదివారం మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రవీంద్రానాయక్, ఎంపీపీ తాతం జగన్మోహన్, కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, మాజీ జెడ్పీటీసీ భాస్కరరెడ్డి పరామర్శించారు. ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

దీప వెలుగులు.. పటాసుల మోతలు


ఎన్‌పీ కుంట: చిచ్చుబుడ్లు వెలిగిస్తున్న చిన్నారులు


బత్తలపల్లిలో బాణాసంచా కాలుస్తూ చిన్నారుల సందడి

● ఘనంగా దీపావళి సంబరాలు

కదిరి టౌన్: పట్టణంలో దీపావళి వేడుకలు అంబరాన్నంటాయి. ప్రతి ఇంటా దీపాలు వెలిగించారు. టపాసులు కాల్చి సందడి చేశారు. మరకత మహాలక్ష్మి ఆలయం, చౌడేశ్వరి, వాసవీమాత ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శ్రీవారికి ప్రత్యేక అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎన్‌పీకుంట: మండలంలో దీపావళి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం మహిళలు ప్రతి ఇంటి ముందు ప్రమిదలు వెలిగించి సంప్రదాయబద్ధంగా లక్ష్మీపూజలు చేశారు. పటాసుల మోతలు వాడవాడలా ప్రతిధ్వనించాయి.

బత్తలపల్లి మండలంలో...

బత్తలపల్లి: మండలంలో ఆదివారం, సోమవారం దీపావళి పండుగను వైభవంగా నిర్వహించుకున్నారు. వెంకటగారిపల్లి, మాల్యవంతం, లింగారెడ్డిపల్లి, సంజీవపురం, డి.చెర్లోపల్లి, కట్టకిందపల్లి గ్రామాల్లో గౌరీ నోములు నోచారు. కొత్త దుస్తులు ధరించి ఇంటి ముందు బాణసంచా కాల్చి వేడుకలు చేసుకున్నారు. 3 రోజులు సెలవులు రావడంతో చిన్నారుల సందడి అంతా ఇంతా కాదు.

ఘనంగా గౌరీ నోములు

అమడగూరు: దీపావళిని పురస్కరించుకుని మండల వ్యాప్తంగా ఉన్న పలు గ్రామాల్లో ఆది, సోమవారాల్లో గౌరీ నోములను ఘనంగా నిర్వహించారు. చీకిరేవులపల్లి, గంగిరెడ్డిపల్లి, రెడ్డివారిపల్లి, బలకవారిపల్లి, శీతిరెడ్డిపల్లి, గుండువారిపల్లిలో గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నోములను గావించారు. నోముల గంపలను నెత్తిన పెట్టుకుని శీతిరెడ్డిపల్లిలోని కోదండ రామాలయంలో అర్చకులు నాగేంద్రస్వామి ఆధ్వర్యంలో పూజలు చేశారు. అర్చకులు గౌరీ నోముల ఆవశ్యకతను తెలియజేశారు. అనంతరం ఇళ్లకు వెళ్లి నోము దారాలను చేతులకు కట్టుకుని పండుగ చేసుకున్నారు.

రామగిరిలో..

రామగిరి: మండలంలోని పేరూరు, పెద్దకొండాపురం, ఎంపీపల్లి, నసనకోట, రామగిరి, మాదాపురం, పోలేపల్లి, కుంటిమద్ది, గంతిమర్రి పంచాయతీల్లోని గ్రామాల్లో దీపావళి వేడుకలు జరుపుకున్నారు.


ప్రత్యేక అలంకరణలో పెద్దమ్మ

సంతోషంగా సంబరాలు

కనగానపల్లి: మండలంలో ఆది, సోమవారాల్లో దీపావళిని సంతోషంగా జరుపుకున్నారు. కనగానపల్లి, తల్లిమడుగుల, తగరకుంట గ్రామాల్లో దేవతలకు జ్యోతుల మహోత్సవాలు నిర్వహించారు. ఇంటింటా మహిళలు దీపాలు వెలిగించారు.

కొత్తచెరువు మండలంలో..

కొత్తచెరువు: మండలవ్యాప్తంగా సోమవారం దీపావళిని ఘనంగా నిర్వహించారు. ప్రతి ఇంటి వద్ద కుటుంబ సమేతంగా టపాసులు పేలుస్తూ సంబరాలు చేసుకున్నారు. కొత్తచెరువులో వెలసిన పెద్దమ్మ అమ్మవారిని సాయంత్రం భక్తిశ్రద్ధలతో ఊరేగింపు నిర్వహించారు.

చక్కెర వితరణ

స్థానిక అయ్యప్ప దేవాలయానికి వైఎస్సార్ సీపీ నాయకుడు దాల్‌మిల్ సూరి 100 కిలోల చక్కెరను వితరణగా ఇచ్చారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకొని అయ్యప్పలు పెద్ద ఎత్తున మాలధారణ చేయనున్నారు. స్వామి వారి ప్రసాదం కోసం చక్కెరను దేవాలయ కమిటీకి సూరి అందజేశారు.

అనాథ పిల్లలకు దీపావళి కానుకలు

పుట్టపర్తిరూరల్: పుట్టపర్తి సమీపంలోని కర్ణాటకనాగేపల్లి వద్ద అనాథాశ్రమంలో ఉన్న పిల్లలకు బాణాసంచాను వైఎస్సార్ సీపీ పుట్టపర్తి పట్టణ కన్వీనర్ రంగారెడ్డి సోమవారం పంపిణీ చేశారు. అలాగే, కొత్త దుస్తులు, స్వీట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే సంబరాలు


టపాసులు అందుకున్న చిన్నారులతో ఎమ్మెల్యే సతీమణి దుద్దుకుంట అపర్ణారెడ్డి

నల్లమాడ: నల్లసింగయ్యగారిపల్లిలోని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి నివాసంలో సోమవారం దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే, ఆయన సతీమణి దుద్దుకుంట అపర్ణారెడ్డి, కుమారుడు దుద్దుకుంట కిషన్‌రెడ్డి ఇతర కుటుంబ సభ్యులతో కలిసి బాణాసంచా కాలుస్తూ సరదాగా గడిపారు. అపర్ణారెడ్డి చేతుల మీదుగా గ్రామంలోని చిన్నారులకు టపాసుల బాక్సులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దీపావళి పండుగ అని తెలిపారు. పుట్టపర్తి నియోజకవర్గంలోని ప్రజలందరి జీవితాల్లో చీకట్లు తొలగి వెలుగులు నిండాలని ఆయన ఆకాంక్షించారు.

ఇయ్యవయ్యా.. సార్‌కివ్వాలి!

కదిరి: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో దీపావళి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాల నుంచి బీజేపీకి చెందిన ఒక నాయకుడు పోలీస్, ఫైర్, రెవెన్యూ అధికారుల పేరు చెప్పి వసూళ్లకు తెగబడ్డాడు. ఒక్కో దుకాణం నుంచి 20 గిఫ్ట్ ప్యాకెట్ల చొప్పున 40 దుకాణాల వద్ద మొత్తం 800 ప్యాకెట్లు వసూలు చేయడాన్ని కొందరు దుకాణాల యజమానులు తీవ్ర స్థాయిలో వ్యతిరేకించారు. ప్రతి దుకాణ యజమాని నుంచి సంబంధిత అధికారుల పేరు చెప్పి సదరు బీజేపీ నాయకుడు రూ. 20 వేల చొప్పున రూ. 8 లక్షలు వసూలు చేయడంపై దుకాణాల యజమానుల మధ్య దీపావళి ముందు రోజు రాత్రి పెద్ద గొడవే జరిగింది. ఇక.. ఇటీవల కర్నూలు జిల్లా నుంచి బదిలీపై వచ్చిన పట్టణ పోలీసు అధికారి పేరు చెప్పి ఒక ఎస్ఐ ఏకంగా 60 గిఫ్ట్ ప్యాక్‌లు (ఒక్కోటి రూ.1,200) ఉచితంగా తీసుకొని ఆటోలో తీసుకెళ్లడాన్ని చూశామని పట్టణ ప్రజలు ఫొటోలు, వీడియోలు చూపారు. దీనిపై పట్టణ సీఐ నారాయణరెడ్డిని వివరణ కోరగా తాను 50 గిఫ్ట్ ప్యాకెట్లు కావాలని తమ ఎస్ఐ బసయ్యతో డబ్బు పంపించానని, అయితే దుకాణాల యజమానులు డబ్బు తీసుకోకుండా టపాసులు పంపించారని తెలిపారు.

మామూళ్ల మత్తు.. నిబంధనలు తుస్సు

స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో దీపావళి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాల ఏర్పాటులో నిబంధనలు తుస్సు మన్నాయి. గ్రౌండ్‌లో తాత్కాలికంగా రేకులతో ఏర్పాటు చేసిన దుకాణాల షెడ్‌లు లాటరీ పద్ధతిన కేటాయించకపోవడంపై కొందరు దుకాణాల యజమానులు తప్పుబట్టారు. అక్కడ చాలామంది దుకాణాల్లో టపాసుల భద్రతపై ఎక్కడా ప్రభుత్వ నిబంధనలు పాటించిన పాపాన పోలేదు. ఒక్క దుకాణంలో కూడా ఫైర్ ఎక్స్‌టెన్షనల్ (అగ్ని మాపక పరికరాలు)కన్పించలేదు. ఏదైనా ప్రమాదం జరిగితే ఆర్పేందుకు నీరు గానీ, ఇసుక బకెట్లు గానీ కానరాలేదు. ఒక్కో దుకాణం మధ్య గ్యాప్ ఉండాలని నిబంధనలు చెబుతున్నప్పటికీ ఎక్కడా పాటించలేదు. కొందరైతే నాలుగు దుకాణాలకు వేర్వేరు పేర్లతో లైసెన్స్ పొందారు. సంబంధిత అధికారులు దీన్ని 'మామూలు'గా తీసుకోవడంతో దుకాణాల యజమానుల మధ్య గొడవకు దారి తీసింది.


కదిరి పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణం

జాతీయ స్థాయి జంప్‌రోప్ పోటీలకు ఎంపిక


విద్యార్థులతో పాత బాలాజీ పాఠశాల సిబ్బంది


విద్యార్థులతో ఆశ్రమ పాఠశాల పీఈటీ ధరణి

నల్లమాడ: జాతీయ స్థాయి జంప్ రోప్ పోటీలకు నల్లమాడలోని పాత బాలాజీ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాల, ఎస్టీ బాలుర ఆశ్రమ పాఠశాల నుంచి మొత్తం 16 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 11,12 తేదీల్లో కర్నూలు జిల్లా మిడుతూరులో జరిగిన రాష్ట్రస్థాయి జంప్ రోప్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఏ. సుదీప్, ఎస్. తహీర్, జీ.ఉమేశ్వర్, టి. సంతోష్, పీ.జగన్, సి.బద్రినాథ్, ఎస్. యూనిస్, డి. జయసూర్య, ఆర్. చరణ్‌నాయక్ జాతీయ స్థాయి జంప్ రోప్ పోటీలకు ఎంపికైనట్లు పాత బాలాజీ పాఠశాల డైరెక్టర్ పోలే వెంకటరెడ్డి తెలిపారు. అలాగే ఆశ్రమ పాఠశాల నుంచి ఏ.చరణ్ లాల్ నాయక్, జి. చరణ్, డి. రంజిత్‌నాయక్, జే. అర్జున్, డి. గణేష్‌నాయక్, కే. భాస్కర్, ఎం.జయంత్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సతీష్ తెలిపారు. విద్యార్థులను కరెస్పాండెంట్ స్వర్ణలత, పీఈటీలు ధరణి, అనీఫ్, సంక్షేమ వసతిగృహ అధికారి సత్యనారాయణ అభినందనలు తెలిపారు.

కదిరి విద్యార్థులు..

కదిరి అర్బన్: విశాఖపట్నంలో జరిగిన అండర్ -14 విభాగం రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ షటిల్ పోటీల్లో కదిరి పట్టణానికి చెందిన మురారి వెంకటేష్ ప్రథమ స్థానం సాధించి బంగారుపతకం కైవసం చేసుకున్నాడు. నాలుగో స్థానంలో కదిరికి చెందిన కాటం ఈశ్వరసాయి నిలిచి, ప్రశంసా పత్రం సాధించాడు. వీరిరువురు త్వరలో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ధర్మవరం అర్బన్: ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చిందని రోటరీక్లబ్ అధ్యక్షుడు జయసింహ, కోశాధికారి సుదర్శన్‌గుప్త, క్యాంపు చైర్మన్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గోరకాటి పుల్లమ్మ, పెద్దారెడ్డిల జ్ఞాపకార్థం కుమారుడు గోరకాటి రఘునాథ్‌రెడ్డి సహకారంతో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. బెంగళూరు శంకర్ కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో 187 మందికి కంటి పరీక్షలు చేశారు. 119 మంది కంటి ఆపరేషన్లకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు నీతు, ఆసుపత్రి కోఆర్డినేటర్ శివప్రకాష్, రోటరీక్లబ్ సభ్యులు సత్రసాల ప్రసన్నకుమార్, సోలిగాళ్ల వెంకటేషులు, నరేంద్రరెడ్డి, కొండయ్య, జయచంద్ర, రామిరెడ్డి, మనోహర్‌గుప్త, రమేష్‌బాబు, కృష్ణమూర్తి, రామకృష్ణ, శివయ్య తదితరులున్నారు.


దాతలను సన్మానిస్తున్న రోటరీక్లబ్ సభ్యులు


నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

తనకల్లు: స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం నుంచి 20 వరకూ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి మస్తాన్‌వలి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి రోజు బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16వ తేదిన గ్రంథాలయ ఉద్యమ మహానుభావులను స్మరించుకోవడం, 17న కవి సమ్మేళనం, సెమినార్లు, రచయిత సందేశాలు, 18న పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన,వక్తృత్వ, క్రీడా పోటీలు, 19న మహిళా దినోత్సవం సందర్భంగా దిశ చట్టం, మహిళా సాధికారతపై చర్చ, 20వ తేదీన డిజిటల్ గ్రంథాలయంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు. అదే రోజు వారోత్సవాల ముంగిపు సందర్భంగా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేస్తామన్నారు. ప్రజలు, పాఠకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నల్లమాడ మండలంలో..

నల్లమాడ: నేటి నుంచి ఈనెల 20 వరకు స్థానిక శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారిణి బి. శకుంతలాబాయి తెలిపారు. పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు, విద్యార్థులు, పాఠకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఉషారాణి


క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

ధర్మవరం రూరల్: ధర్మవరం జూడో క్లబ్ క్రీడాకారిణి జి. ఉషారాణి రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎంపికైనట్లు కోచ్ వినాయత్ బాషా సోమవారం తెలిపారు. ఈ నెల 10, 11 తేదిల్లో అనంతపురం ఆర్డీటీ ఇండోర్ స్టేడియంలో జరిగిన అండర్-14 పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారన్నారు. ఈ నెల 26న కర్నూలు పోటీలుంటాయన్నారు. అలాగే, పోటీల్లో పాల్గొన్న సాయి ప్రియ, యువ సంధ్య కాంస్య పతకాలు సాధించినట్లు ఆయన తెలిపారు. క్రీడాకారులను జూడో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా స్టేట్ సీఈఓ బాబు, టూటౌన్ ఎస్ఐ రవీంద్రబాబు తదితరులు అభినందించారు.

నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్'

ఎన్‌పీకుంట: మండల కేంద్రంలోని ఎన్.పీ.కుంట-1 సచివాలయం పరిధిలో మంగళవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ ఈటెరాము, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కొత్త రంగారెడ్డి సోమవారం తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. సచివాలయంలో కార్యక్రమం ముగియగానే మండల నాయకులు నిర్దేశించిన ప్రదేశంలో పార్టీ జెండా ఆవిష్కరణ ఉంటుందని తెలిపారు. జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, ఉపసర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల కన్వీనర్లు హాజరుకావాలని వారు కోరారు.

కాళసముద్రంలో..

కదిరి అర్బన్: మండల పరిధిలోని కాళసముద్రం గ్రామ సచివాలయంలో నేడు (మంగళవారం) 'రాష్ట్రానికి జగనన్నే ఎందుకు కావాలి' అనే కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ అంజనప్ప సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి హాజరవుతారని తెలిపారు. ప్రజాప్రతినిధులంతా తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

గాండ్లపెంట మండలంలో..

గాండ్లపెంట: మండల కేంద్రంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం మధ్యాహ్నం 4.30 గంటలకు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు చెప్పారు. జెడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్‌లు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నల్లచెరువులో..

నల్లచెరువు: మేజర్ పంచాయతీలోని సచివాలయం -1 పరిధిలో ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ రమణారెడ్డి, వైఎస్సార్ సీపీ కన్వీనర్ హైదర్‌వలి, సర్పంచ్ పంచ రత్నమ్మ సోమవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. సాయంత్రం కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

నేడు రామగిరిలో..

రామగిరి: మండల కేంద్రంలో మంగళవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కర్రా హనుమంతరెడ్డి, సర్పంచ్ మీనుగ నాగరాజు ఓ ప్రకటనలో తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, మండల నాయకులు హాజరుకావాలన్నారు.

బత్తలపల్లిలోనూ..

బత్తలపల్లి: మండల కేంద్రంలోని బత్తలపల్లి-2 గ్రామ సచివాలయ పరిధిలో మంగళవారం సాయంత్రం 3 గంటలకు 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ బగ్గిరి త్రివేణి, జెడ్పీటీసీ కోటి సుధ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

'డయల్ యువర్ డీఎం'కు విశేష స్పందన

పుట్టపర్తి టౌన్: 'డయల్ యువర్ డీఎం'కు విశేష స్పందన లభించింది. పుట్టపర్తి ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికుల సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకు డీఎం ఇనయతుల్లా ఆదివారం కార్యక్రమం నిర్వహించారు. కొత్తచెరువు నుంచి కదిరి మార్గంలో దొన్నికోట మీదుగా కొన్ని బస్సు సర్వీసులు నడపాలని దొన్నికోటకు చెందిన లోకేష్ కోరారు. పుట్టపర్తి నుంచి చెన్నేకొత్తపల్లికి తలమర్ల, మరకుంటపల్లి, మునిమడుగు మీదుగా నడపాలని తలమర్లకు చెందిన కృష్ణారెడ్డి విజ్ఞప్తి చేశారు. ముదిగుబ్బ రూట్‌లో బస్సులు సమయానికి తిరగడం లేదని చంద్రాయునిపల్లికి చెందిన చంద్ర ఫిర్యాదు చేశారు. హిందూపురం నుంచి తిరుపతికి వయా మహమ్మదాబాద్, కొక్కంటి క్రాస్ మీదుగా వెళ్లేలా చూడాలని కొక్కంటిపల్లి నారాయణరెడ్డి కోరారు. పుట్టపర్తి నుంచి గోరంట్ల మీదుగా వంగసందరం వరకూ బస్సులు నడపాలని గోరంట్లకు చెందిన నరశింహులు విజ్ఞప్తి చేశారు. సమస్యలు విన్న అనంతరం డీఎం మాట్లాడారు. పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

తలుపుల: గొల్లపల్లితండా సమీపంలో ఉన్న బస్సు షెల్టర్ వద్ద గుర్తు తెలియని 70 ఏళ్ల వృద్ధుడు సోమవారం చనిపోయాడు. విషయాన్ని గ్రామస్తులు పోలీసులకు సమాచారం చేరవేశారు. ఎస్ఐ మగ్బుల్‌బాష ఆధ్వర్యంలో పోలీసులు పరిశీలించి, ఏ ఆధారాలు లేవని గుర్తించారు. సమీప అటవీ ప్రాంతంలో శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించారు.

ఇద్దరికి గాయాలు

కదిరి అర్బన్: ఆలంపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తలుపుల మండలానికి చెందిన కృష్ణారెడ్డి, చెన్నకేశవరెడ్డి గాయపడ్డారు. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు.. సోమవారం తలుపుల నుంచి కదిరికి ద్విచక్రవాహనంలో వస్తుండగా.. ఆలంపూర్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఇద్దరూ కిందపడి గాయాలపాలయ్యారు. స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

17న బహిరంగ వేలం

తాడిమర్రి: చిల్లవారిపల్లిలో వెలసిన కాటికోటేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 17న బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. టెంకాయలు, పూజా సామగ్రి విక్రయం, తలనీలాలు పోగు చేసుకునే హక్కు, గాజులు, బొమ్మల విక్రయానికి వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రూ. 5 వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు.

కళాకారులకు ఘన సన్మానం


కళాకారునికి ప్రశంసా పత్రం ఇస్తున్న దృశ్యం

ధర్మవరం రూరల్: పట్టణంలో ప్రముఖ రంగస్థల కళాకారుడు సి.ఫక్కీరప్ప, తోలుబొమ్మల కళాకారుడు సిందే చిదంబరరావు, హార్మోనిస్టు ఏవీ రమణను సోమవారం తేనె తెలుగు కల్చరల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు వ్యవస్థాపకులు అంజినప్ప, కళాభిషేకం డైరెక్టర్ పెద్దరికం సాయిలు మాట్లాడుతూ గతంలో కళాభిషేకం కార్యక్రమం ద్వారా ఎంతో మంది కళాకారులను ప్రేక్షక లోకానికి పరిచయం చేశామన్నారు. సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ గుర్తింపుతో పాటు ఆదరణ కల్పించిన ట్రస్టు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

రోగులకు అన్నదానం


రోగులకు అన్నదానం చేస్తున్న సేవా సమితి సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం వాసవి నారాయణ సేవా సమితి సభ్యులు రోగులకు అన్నదానం చేశారు. వల్లం కొండనగేష్ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు రోగులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వాసవి నారాయణ సేవా సమితి సభ్యులు ఓవీ ప్రసాద్, కాకుమాని శ్రీహరి, బాలాజీ, సాగర్, బాబు, ప్రసాద్, కృష్ణమూర్తి, నాగరాజు, మల్లి తదితరులు పాల్గొన్నారు.